క్లుప్తంగా

పరామర్శ



నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: మండలంలోని దొంగతుర్తికి చెందిన పెర్క తిరుమల, రామయ్యపల్లికి చెందిన మార్క కిష్టయ్య అనారోగ్యంతో మరణించారు. కాగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూల మాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీ కొడరి అంజన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, అల్వాల రాజేశం, యూత్ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, సది, మహేందర్, నాగరాజు ఉన్నారు.

గణనాథుడికి వీడ్కోలు



రామగిరి: మండలంలోని లద్నాపూర్‌లో ఏర్పాటు చేసిన పలు విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నసంతర్పణ చేశారు. గ్రామాల్లోని పురవీధుల గుండా గణేషుని ఊరేగింపు నిర్వహించారు. మహిళలు కోలాటం, ఆటపాటలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. రామిండ్ల మనోహర్, అడ్డూరి ప్రవీణ్, రామిండ్ల దుర్గయ్య, రామిండ్ల రాజేందర్, అడ్డూరి నవీన్, సంజీవ్, ఉమేశ్, బానేష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి

రామగుండం: పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని ఎంపీడీవో అలీం ఆదేశించారు. అంతర్గాం మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఎంపీడీవో ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రతీ నెల 11, 21వ తేదీల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, ప్రతీ సోమవారం గ్రామాల్లోని చెత్త సేకరించాలని, బుధ, శనివారాల్లో అవెన్యూ ప్లాంటేషన్ నీటిని పట్టించాలని సూచించారు. ప్రతీ మంగళ, శుక్ర వారాల్లో మొక్కలు నాటాలని, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. డ్రైనేజీల్లో మురుగు తొలగించాలన్నారు. సమావేశంలో ఏపీవో రమేశ్, ఎంపీవో వేణుగోపాల్ ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పొట్యాల హైస్కూల్ విద్యార్థులతో బుధవారం పాఠశాల ప్రాంగణంలో స్వచ్ఛతాహీ సేవాపై ఎంపీడీవో అలీం, పాఠశాల ఉపాధ్యాయ బృందం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ వ్యక్తి పరిశుభ్రతపై వ్యక్తిగత శ్రద్ధ వహించినప్పుడే నివసించే ప్రదేశాలు స్వచ్ఛతగా మారుతాయన్నారు. దీంతో పాటు భోజనానికి ముందు, భోజనం తర్వాత పాటించాల్సిన పద్ధతులను విద్యార్థులకు వివరించారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

గోదావరిఖని: కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో పోస్టర్ విడుదల చేశారు. ఈనెల 30న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ నాయకులు నరేశ్, చిలుక శంకర్, బి.అశోక్, కోండ్ర మొగిలి, ఎం.దుర్గయ్య, ఎడ్ల రవికుమార్, తిప్పని రాంకీ, ఎల్లయ్య, ఎం.కొమురయ్య, డి.రాజేశం, మేరుగు చంద్రయ్య, కొల్లూరి మల్లేశ్, పి.రమేశ్, ఎస్.తిరుపతి, ధర్మేందర్, ఐ.సాంబయ్య, మల్లేశం పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రామగిరి మండలం వెంకట్రావుపల్లి పంచాయతీ కార్మికుడు నల్లూరి కల్యాణ్ విధులు నిర్వహిస్తూనే మరణించాడు. అతని కుటుంబానికి రూ.10లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. బుధవారం జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యను కలిసి వినతిపత్రం అందించారు. కార్మికుడు మరణించి ఐదు రోజులు గడిచినా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం చేసిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు అశోక్, శ్రావణ్, నవీన్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



ధర్మారం: అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్



సుల్తానాబాద్: అభినందిస్తున్న శౌరెడ్డి



అభినందిస్తున్న పీఈటీ అజయ్

ధర్మారం: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థులు మనోజ్ఞ, సౌజ్ఞశ్రీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, పీఈటీలు బైకాని కొమురయ్య, సంజీవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

సెయింట్ మేరీస్ విద్యార్థులు..

సుల్తానాబాద్: పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ కొమ్ము గట్టయ్య, కరస్పాండెంట్ శౌరెడ్డి తెలిపారు. ఈ నెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు సెయింట్ మేరీస్‌కు చెందిన అండర్–16 విభాగంలో జశ్వంత్, ఆదిత్యలు లాంగ్‌జంప్ పోటీల్లో, పట్టణానికి చెందిన అశీన్ 100, 200 మీటర్ల పరుగు పందెంలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా బుధవాఆరం వారిని అభినందించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించింది



మాట్లాడుతున్న కౌశిక హరి

పాలకుర్తి: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించిందని, రైతులు, కార్మికులు ఒక్క తాటిపై నడిచి న్యాయం కోసం పోరాడాలని బీఆర్ఎస్ నాయకుడు, కేశోరాం కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు కౌశికహరి అన్నారు. బీఆర్ఎస్ పాలకుర్తి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం బసంత్‌నగర్‌లోని శ్రీకోదండ రామాలయం ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కౌశికహరి మాట్లాడారు. రాష్ట్రంలోని రైతుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరిట రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఈనెల 21న పాలకుర్తి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు రుణమాఫీపై రైతులకు జరిగిన అన్యాయాన్ని నిలదీసేందుకు ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలవ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మాజీ వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి తోడేటి శంకర్‌గౌడ్, కేశోరాం కాంట్రాక్ట్ కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, నాయకులు బండారి కిరణ్, పున్నం సాగర్, ఎండీ అతిఖ్, సర్వర్‌పాషా, బత్తిని సతీశ్, ముత్యం సంతోష్‌గౌడ్, తీగల కొమురయ్య, సందవేణి రాజయ్య పాల్గొన్నారు.

ఇంటింటా సర్వేపై సమావేశం



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమానాయక్

మంథని: మంథని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీవో హనుమానాయక్ సమావేశమయ్యారు. ఎస్ఎస్ఆర్–2025 ఇంటింటా సర్వేపై చర్చించి పలు సూచనలు చేశారు. డివిజన్‌లోని తహసీల్దార్లు కార్యక్రమం పర్యవేక్షించాలని ఆర్డీవో సూచించారు.

ఎన్ఎస్‌యూఐ కాలనీ అధ్యక్షుడిగా ప్రశాంత్



నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

యైటింక్లయిన్‌కాలనీ: ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘం యైటింక్లయిన్‌కాలనీ అధ్యక్షుడిగా కాలనీకి చెందిన ప్రశాంత్‌గౌడ్‌ను నియమిస్తున్నట్లు ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గం అధ్యక్షుడు దాసరి విజయ్‌కుమార్ ప్రకటించారు. బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు.

కీచక ఉపాధ్యాయులను అరెస్టు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

కాల్వశ్రీరాంపూర్/పెద్దపల్లిరూరల్: కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రభుత్వ ఉపాధ్యాయులను వెంటనే అరెస్టు చేయాలని ఏబీవీపీ నాయకులు బుధవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రవర్తించిన తీరు విద్యార్థినుల్లో వారి తల్లిదండ్రుల్లో భయాందోళనకు గురి చేసిందని, ప్రభుత్వ పాఠశాలలకు ఆడపిల్లలను పంపేందుకు జంకుతున్నారని వారు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునారావృతం కాకుండా దోషులను చట్టపరంగా శిక్షించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్, హాస్టల్ విభాగ్ కన్వీనర్ రాసూరి ప్రవీణ్, నగర కార్యదర్శి అజయ్, నాయకులు అరవింద్, సాయితేజ, సందీప్ ఉన్నారు.

డ్రోన్‌తో పిచికారీ చేయడం లాభదాయకం



డ్రోన్‌తో చేస్తున్న పిచికారీని పరిశీలిస్తున్న అధికారి

యైటింక్లయిన్‌కాలనీ: రైతులు వరిపంటలో డ్రోన్ సాయంతో రసాయన, ఎరువుల మందులను పిచికారీ చేయడంతో సులభంతో పాటు లాభదాయకంగా ఉంటుందని రామగిరి మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ రైతులకు సూచించారు. రామగిరి మండలం ముస్త్యాలకు చెందిన విజేందర్ రెడ్డికి సంబంధించిన 20 ఎకరాలలో డ్రోన్ సాయంతో బుధవారం రసాయన ఎరువుల మందులు పిచికారీ చేయడాన్ని పరిశీలించారు. ఏఈవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో 100 అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తాం

ఓదెల: మండలంలోని నాంసానిపల్లెలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లాల రాంనర్సయ్య తెలిపారు. మండలంలోని నాంసానిపల్లెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో 100 అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, కుర్మపల్లి మాజీ సర్పంచు మామిడిపల్లి బాపయ్య, విగ్రహ దాత ఆసంపల్లి శ్రీనివాస్, ఎస్సీఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు మధు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు అందజేత

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుర్తింపు కార్డులను ప్రధానోపాధ్యాయులు దూస రమేశ్ అందజేశారు. పాఠశాలలో చేరి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా రూ.5వేల ఖర్చులతో ముద్రించిన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

రామగిరి: మంథని నియోజకవర్గంలో దళితబంధు రెండో విడత నిధులు వెంటనే విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి నియోజకవర్గం అధ్యక్షుడు ఊట్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నాగెపల్లిలో బుధవారం ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం నియోజకవర్గం మదిరలో అందించినట్లు మంథనిలో రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయాలని కోరారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధుతో ఎంతోమంది ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మంథని నియోజకవర్గంలో దళితబంధుకు ఎంపికైన 1100 మందికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా దశలవారీగా లబ్ధిదారులను ఎంపికచేసేలా మంత్రి చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు ఆర్ల స్వామి, డివిజన్ కోశాధికారి గద్దల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● **డీటీఎఫ్ మండల కార్యవర్గం ఏర్పాటు**

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా కె.సదయ్య, ప్రధాన కార్యదర్శిగా కె.రాజుతో పాటు ఉపాధ్యక్షులుగా పుష్పలత, శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులుగా స్వరూపరాణి, శ్రీనివాస్, రాజు, జిల్లా కౌన్సిలర్లుగా షేక్ షంశోద్దిన్, మల్లేశ్వర్‌రావు, రమేశ్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా గంగారాం, సభ్యులుగా శంకర్, రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి శ్యామ్, జిల్లా అధ్యక్షుడు రాంకిషన్‌రావు పాల్గొన్నారు.

● **అక్కినేని శత జయంతి ఉత్సవాలు విజయవంతం చేయండి**

మంథని: అక్కినేని నాగేశ్వర్‌రావు శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని మంథని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి కోరారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. 20న స్థానిక ఫ్రెండ్స్‌క్లబ్‌లో జరిగే శత జయంతి ఉత్సవాల్లో అభిమానులు, కళాకారులు, కవులు, గాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రామగుడు మారుతి, బాపు ఉన్నారు.

● **ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్**

ఓదెల: ఓదెల ఆదర్శ పాఠశాల(మోడల్) ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ జావీద్ ధర్మారంలో బాధ్యతలు స్వీకరించారు. పాఠశాలలో పనిచేసిన 15మంది ఉపాధ్యాయులు జిల్లాలోని ఆయా పాఠశాలలకు బదిలీపై వెళ్లారు.

● **కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్‌గా వకీల్**

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్‌గా ఎండీ వకీల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల నుంచి ప్రమోషన్‌పై కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్‌గా వచ్చారు.

● **సౌకర్యాలు కల్పించాలి**

జ్యోతినగర్: ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు కార్యాలయానికి సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాంసాని శంకర్ వినతిపత్రం పంపించారు.

● **పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం**

యైటింక్లయిన్‌కాలనీ: నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కార్పొరేటర్ బాదావత్ శంకర్ నాయక్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ ఏరియా వాసులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.500లకు గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా లబ్ధిపొందిన వారికి అర్హత పత్రాలను బుధవారం అందజేశారు.

● **నిధులు కేటాయించాలి**

జ్యోతినగర్: బతుకమ్మ పండుగ నిర్వహణకు ఏర్పాట్లు చేయడానికి ఎన్టీపీసీ రామగుండం సంస్థ సీఎస్సార్ నిధులు కేటాయించాలని మూడో డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాస్ కోరారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం పరిపాలనా భవనంలోని సీఎస్సార్ విభాగం డీజీఎం ప్రవీణ్ కె.చౌదరి, పాండే, యుగంధర్‌రావుకు వినతిపత్రం అందించారు.

● **మిత్రుడి కుటుంబానికి చేయూత**

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు రంగంపల్లికి చెందిన జంపయ్య ఇటీవల మరణించాడు. కాగా బుధవారం ఆయన కుటుంబానికి స్నేహితులు రూ.10,600 అందజేశారు.

● **సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు**

జ్యోతినగర్: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే అని సీపీఎం సీనియర్ నాయకుడు ఎన్.భిక్షపతి అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని సీఐటీయూ కార్యాలయంలో తుంగపిండి మల్లేశ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారితో కలిసి ఆయన మాట్లాడారు.

● **టీసేఫ్ యాప్ సద్వినియోగం చేసుకోండి**

పెద్దపల్లిరూరల్: మహిళలు, పౌరుల భద్రత కోసం టీసేఫ్ యాప్‌ను వినియోగించుకోవాలని షీటీం ఏఎస్ఐ మల్లయ్య, మహిళా సాధికారిత ప్రతినిధులు కోరారు. పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బుధవారం విద్యార్థులకు మహిళల భద్రత, సైబర్ నేరాలు, డయల్ 100 సేవలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య, అర్చన, శ్రీలత, సతీశ్‌కుమార్ ఉన్నారు.

● **బాధితులకు న్యాయం చేయాలి**

గోదావరిఖని: సింగరేణి మారుపేర్ల బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం ఎన్సీపీ నాయకులు మేకల శ్రీధర్‌యాదవ్, గోలివాడ ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్ఎల్‌సీ సమావేశంలో 14 కార్మిక సంఘాలు మారుపేర్ల సమస్యలు పరిష్కరించడానికి సంతకాలు చేశారని, అయినా తమకు న్యాయం జరగలేదన్నారు. 20న జరిగే ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నాకు మద్దతు ప్రకటించి హాజరుకావాలని కోరారు.

● **అంగన్‌వాడీ సేవలు ఉపయోగించుకోండి**

యైటింక్లయిన్‌కాలనీ: అర్హులైన ప్రతీఒక్కరు అంగన్వాడీ సేవలను ఉపయోగించుకోవాలని మంథని సీడీపీవో పుష్పలత అన్నారు. ఎస్ఎస్ఎఫ్ ప్రి ప్రోగ్రాంలో భాగంగా బుధవారం రామగిరి మండలం సుందిళ్లలోని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

● **పోషణ మాసోత్సవం**

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో అంగన్‌వాడీ కేంద్రం–3లో బుధవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. తక్కువ బరువు ఉన్న పిల్లల తల్లులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

సింగరేణి వార్తలు

సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు బుధవారం జీఎం ఎస్.సుధాకర్‌రావు ఆదేశాల మేరకు క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. 207 ఖాళీ క్వార్టర్లు ఉండగా ఫ్రెష్ అలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ కోసం 71 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ఏపీఏ ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ తెలిపారు. 30 మంది ఉద్యోగులు హాజరై 27 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారని, వారికి త్వరలోనే అలాట్‌మెంట్ లెటర్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, డీవైపీఎం గుర్రం శ్రీహరి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎం ఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, సదయ్య పాల్గొన్నారు.

రెస్క్యూ శిక్షణతో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి



శిక్షణ సభ్యులతో రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి

గోదావరిఖని: రెస్క్యూలో పూర్తిగా పట్టుసాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. రెస్క్యూ 188వ బ్యాచ్‌కు నూతనంగా ఎంపికైన సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం జీఎం ప్రారంభించారు. ఆసక్తితో ముందుకు సాగి రెస్క్యూ విధివిధానాలు, ఆపదకాలంలో వ్యవహరించాల్సిన తీరుపై తర్ఫీదు పొందాలని సూచించారు. సీనియర్లు ఇస్తున్న సూచనలు, సలహాలు పాటిస్తూ ఉత్తమ రెస్క్యూ సభ్యులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ప్రమాదాల సమయంలో రెస్క్యూ సభ్యుల పాత్ర కీలకమన్నారు. ప్రతీఒక్కరు అన్ని అంశాలపై పట్టుసాధించాలని కోరారు. కార్యక్రమంలో రెస్క్యూ అధికారులు భాస్కర్‌రెడ్డి, నర్సింహామూర్తి, శిక్షకులు జక్కుల కిషన్‌రావు పాల్గొన్నారు.

ఆర్జీ–2 అధికార ప్రతినిధిగా అనిల్‌కుమార్



గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 అధికార ప్రతినిధిగా ఎస్.అనిల్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ అధికార ప్రతినిధిగా ఉన్న రాజేంద్రప్రసాద్ కొత్తగూడెం కార్పొరేట్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో ఇక్కడే డీజీఎం పర్సనల్‌గా పనిచేస్తున్న అనిల్‌కుమార్ అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించారు. పర్సనల్ విభాగం అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. డీవైపీఎం వంశీధర్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, పర్సనల్ సిబ్బంది సీహెచ్.సత్యనారాయణ, శివశంకర్, శ్రీలేఖ, మౌనిక, జయ, సమత, సతీశ్ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

గోదావరిఖని: గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఎస్‌వోటూ జీఎం సంతోష్‌కుమార్ అన్నారు. ఆర్జీ–2 ఏరియాలో వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ క్రీడాపోటీలు బుధవారం యైటింక్లయిన్ కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియంలో ప్రారంభమయ్యాయి. పోటీలను ఆయన ప్రారంభించారు. నాయకులు జీగురు రవీందర్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, సెక్యూరిటీ అధికారి షరీఫ్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు 15రోజుల్లో లాభాల వాటా ఇప్పిస్తాం



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు 15రోజుల్లో లాభాల వాటా ఇప్పిస్తామని ఐఎన్‌టీయూసీ నేత నర్సింహారెడ్డి అన్నారు. ఆర్జీ–1 సీఎస్‌పీలో బుధవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని, కార్మికునికి సంబంధించిన పెర్క్స్‌పై విధించే ఇన్కమ్ ట్యాక్స్ రద్దు చేయిస్తామన్నారు. సింగరేణికి గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాలను ప్రకటించి వాటిలో కార్మికుల వాటా అందించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సదానందం, వడ్డేపల్లి దాస్, టైసన్ శ్రీనివాస్, గడ్డం కృష్ణ, పోచయ్య, మండ రమేశ్, పుట్ట రమేశ్, మల్లికార్జున్, కుషనపల్లి శంకర్, బూర జగన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆర్జీ–2 ఏరియాలో..

ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు కొత్త సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఓసీపీ–3 కృషిభవన్, బేస్‌వర్క్‌షాప్‌లో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళా ఉద్యోగులకు రక్షణ, ఎన్–1 ప్లేడేలు, పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ రద్దు తదితర అంశాలపై మాట్లాడారు. నాయకులు సంపత్‌రెడ్డి, ప్రభాకర్, లింగమూర్తి, కృష్ణ, మార్కండేయులు, దశరథం గౌడ్, లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



గోదావరిఖని: అటువైపు మంచిర్యాల జిల్లా.. ఇటువైపు పెద్దపల్లి జిల్లా రెండు జిల్లాల మధ్యలో పారుతున్న గోదావరినదిలో సూర్యుడు అస్తమించడం, ప్రతిబింబం నదిలోని జలాలపై పడటం చూడముచ్చట గొలుపుతోంది. రోజంతా ప్రజలకు వెలుగునిచ్చిన సూరీడు గోదావరినదిలో అస్తమిస్తున్న దృశ్యం చూపరులకు ఎంతగానో ఆకట్టుకుంది. అప్పుడే ఒక రోజు గడిచిపోయిందా అంటూ నిట్టూరుస్తున్న జనాల మధ్య ఇక సెలవు అంటూ సూరీడు అస్తమించాడు.

ఉచిత కంటి వైద్యశిబిరం వినియోగించుకోండి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ హనుమాన్ నగర్ ఏరియాలో జనతా గ్యారేజ్‌లో నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ స్టాలిన్‌గౌడ్ సూచించారు. శ్రీనేత్రాలయ కంటి హాస్పిటల్ హైదరాబాద్ వారి సౌజన్యంతో గురువారం ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. వివరాలకు రమణారెడ్డి సెల్ నంబర్ 97044 39523, స్టాలిన్‌గౌడ్ సెల్ నంబర్ 97016 50555ను సంప్రదించాలని కోరారు.

బాధ్యతలు స్వీకరణ

ధర్మారం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఈరవేణి రాజ్‌కుమార్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకు ముందు పనిచేసిన ప్రిన్సిపాల్ బదిలీపై వెళ్లగా గొల్లపెల్లి మోడల్ స్కూల్ నుంచి బదిలీపై వచ్చిన రాజ్‌కుమార్ ధర్మారం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు.